www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 17 మార్చి 2024
5
అన్నమయ్య

మున్సిపల్ కమిషనర్‌గా వాసుబాబు బాధ్యతలు

బాధ్యతలు స్వీకరిస్తున్న వాసుబాబు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.వాసుబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అనారోగ్య సమస్యల వల్ల వైద్య సెలవుపై వెళ్లగా సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం వాసు బాబును కమిషనర్‌గా నియమించింది. ఆయన డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ సెక్రటరీగా పనిచేస్తూ బదిలీపై రాయచోటికి వచ్చారు. కమిషనర్‌ను మున్సిపల్ అధికారులు, సిబ్బంది మల్లికార్జున, కొండయ్య, మాసూం భాష, భక్తుడు, సుబ్బరాయుడు శాలువ కప్పి స్వాగతం పలికారు. కమిషనర్ ఛాంబర్లో బాధ్యతులు తీసుకున్న అనంతరం మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోగిన నగారా

- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- 25న నామినేషన్ల స్వీకరణకు చివరి గడువు, 26న పరిశీలన, 29న ఉపసంహరణ
- మే 13న పార్లమెంట్, అసెంబ్లీకి పోలింగ్
- జూన్ 4న కౌంటింగ్



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. కేంద్ర ఎలక్షన్ కమిషన్ శని వారం సాయంత్రం సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల షెడ్యూలును విడుదల చేసింది. 2024 ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల, మే 13న పోలింగ్, జూన్ నాలుగున కౌంటింగ్ నిర్వహిం చనున్నట్లు ప్రకటించింది. జిల్లా అధికార యంత్రాంగం ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలుకుని సమర్థ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఉద్యోగులకు శిక్షణను పూర్తి చేసింది. తాజాగా ఎన్నికల కమిషన్ షె డ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చి ంది. కడప జిల్లాలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్, అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు, అసె ంబ్లీ నియోజకవర్గాలు, కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా రాజకీయ పార్టీలైన అధికార వైసిపి జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు టికెట్లు ప్రకటించింది. ప్రతిపక్ష టిడిపి సైతం పొత్తు ధర్మంలో భాగంగా ఒకటి, రెండు అసెంబ్లీలు పార్లమెంట్ స్థానాలు మినహా మిగిలిన అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది.

ఆర్నెళ్లుగా ఆశావహుల ప్రచారం

జిల్లాలో ఆర్నెళ్లుగా ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో అధికార, ప్రతిపక్ష, ఎన్నికల బరిలో నిలిచే ఇతర పార్టీల అభ్యర్థులు ఆర్థిక, అంగ బలాలకు పదును పెడుతున్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు కత్తులు దూస్తూ ముందు కెళ్తున్నారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల మధ్య పరస్పర విమర్శల వర్షం కురుస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అసంతృప్తులను బుజ్జ గింపులు ప్రక్రియ ఊపం దు కుంది. రాబోయే రోజుల్లో మరింత ఊపందుకోనుంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థులు ఎన్నికల వ్యూహ, ప్రతి వ్యూహాలు, ఎత్తుగడలను వ్యూహాత్మకంగా అమలు చేయడంపై దృష్టి సారించారు.

హోరాహోరీ...షురూ

జిల్లాలో హోరాహోరీ పోరుకు తెరలేచింది. అధికార వైసిపి కడప జిల్లాలో సిట్టింగులనే బరిలో నిలిపింది. అన్నమయ్య జిల్లాలో రాజంపేట మినహా పాతకాపులకే అవకాశం కల్పించింది. ఎన్నికల సమరాంగణంలోఅనుభవజ్ఞులనే దింపింది. ప్రతిపక్ష టిడిపి మైనార్టీ స్థానమైన కడపలో మాధవిని బరిలో నిలిపి అదృష్టాన్ని పరీక్షిస్తోంది. జమ్మలమడుగులో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి బిజెపి తరుపున బరిలో నిలవనున్న నేపథ్యంలో ఉత్కంఠను కలిగిస్తోంది. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి టికెట్ లభించడంతో హోరాహోరీ పోటీ నెలకొంది. కమలాపురం, మైదుకూరు అసెంబ్లీ స్థానాల్లో సీనియర్లు, యువతకు అవకాశం ఇవ్వడంతో నువ్వానేనా అనే వాతావరణం నెలకొంది. రాజంపేట టికెట్ టిడిపి అభ్యర్థికి ఇస్తే హోరాహోరీ పోటీ నెలకొనే అవకాశం ఉంది. కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాల్లో ఉత్కంఠభరిత పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది. కడప పార్లమెంట్ బరిలో వైఎస్.అవినాష్‌రెడ్డికి పోటీగా మాజీమంత్రి కీ.శే వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె ఎన్నికల బరిలో దిగే అవకాశాలు ఉన్న నేపథ్యం ఉత్కంఠను కలిగిస్తోంది.

వైసిపి అభ్యర్థులు వీరే

- జిల్లాలోని ఏడు అసెంబ్లీలకు సీనియర్లే
- అన్నమయ్య జిల్లాలో నాలుగింటికీ పాతకాపులే
- రాజంపేటకు ఆకేపాటి, మదనపల్లెకు నిస్సార్
- కడప ఎంపీకి వైఎస్.అవినాష్‌రెడ్డి
- రాజంపేట ఎంపీకి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వేంపల్లి మండలం ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ దగ్గర సీనియర్ మంత్రి ధర్మాన ప్రసాదరావు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌లు రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, అనకాపల్లి మినహా మిగిలిన 24 పార్లమెంటు టికెట్లను ప్రకటించారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజంపేట, మదనపల్లె మినహా మిగిలిన అభ్యర్థులందరూ సిట్టింగు ఎమ్మెల్యేలకు టికెట్లు కేటాయించారు. కడప, రాజంపేట పార్లమెంట్ టికెట్లు సైతం సిట్టింగు ఎంపీలైన వైఎస్ అవినాష్‌రెడ్డి, పెద్దిరెడ్డి వెంకట మిధున్‌రెడ్డికి కేటాయించారు. జిల్లాలోని కడప అసెంబ్లీ టికెట్ డిప్యూటీ సిఎం ఎస్‌బి అంజాద్‌బాషా, కమలాపురం పోచిమారెడ్డి రవీంద్రనాధరెడ్డి, మైదుకూరు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, ప్రొద్దుటూరుకు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, జమ్మలమడుగుకు మూలే సుధీర్‌రెడ్డి, పులివెందుల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బద్వేల్ టికెట్ డాక్టర్ దాసరి సుధకు లభించింది. అన్నమయ్య జిల్లాలో రాయచోటి అసెంబ్లీకి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రైల్వేకోడూరు కొరముట్ల శ్రీనివాసులు, మదనపల్లికి నిస్సార్ అహ్మద్, పీలేరు చింతల రామచంద్రారెడ్డి, తంబళ్ల పల్లి పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డికి టికెట్లు లభించాయి. రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి టికెట్‌ను జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర నాధరెడ్డికి టికెట్ లభించడం విశేషం. అధికార వైసిపి 12 విడతలుగా సమన్వయ కర్తలను నియమించింది. కడప, అన్నమయ్య జిల్లాకు చెందిన 13 మందిలో 12 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించకపో వడంతోఊహాగానాలు చోటుచే 0.2ఎసుకున్న సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన పలువురు స్థానాలను మార్చు తున్నట్లు, వైఎస్ కుటుంబీకులు పోటీ చేయనున్నట్లు సాగిన ఊహాగానాలకు చెక్ పెట్టినట్లు అయింది. తాజాగా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల టికెట్ల పట్ల స్పష్టత లభించడం, ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో అధికార వైసిపికి చెందిన సిట్టింగు ఎమ్మెల్యేలు ఎన్నికల ప్రోరు పతాకస్థాయి చేరుకోనుంది. ఇప్పటివరకు ప్రతిపక్ష టిడిపి కడప జిల్లా టిడిపి అభ్యర్థులను దశల వారీగా ప్రకటిస్తూ పోయిన సంగతి తెలిసిందే. టిడిపి అభ్యర్థులు సైతం ఎన్నికల ప్రచారాన్ని వ్యూహాత్మకంగా సాగిస్తుండడంతో అధికార వైసిపి అభ్యర్థులు మిన్నకు ఒడిపోయారు. తాజా రాష్ట్రవ్యాప్త టికెట్ల ప్రకటనతో ఎన్నికల సమరాంగణం పూర్తిస్థాయిలో వేడెక్కే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
పులివెందుల

ఎస్.బి.అంజాద్‌బాషా
కడప

ఎస్.రఘురామిరెడ్డి
మైదుకూరు

డాక్టర్ సుధా
బద్వేల్

సుధీర్‌కుమార్‌రెడ్డి
జమ్మలమడుగు

పి.రవీంద్రనాథరెడ్డి
కమలాపురం

రాచమల్లు ప్రసాద్‌రెడ్డి
ప్రొద్దుటూరు

ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
రాజంపేట

గడికోట శ్రీకాంత్‌రెడ్డి
రాయచోటి

కొరముట్ల శ్రీనివాసులు
రైల్వేకోడూరు

నిస్సార్ అహ్మద్
మదనపల్లె

చింతల రామచంద్రారెడ్డి
పీలేరు

పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి
తంబళ్లపల్లె

వై.ఎస్.అవినాష్‌రెడ్డి
కడప (ఎంపీ)

పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
రాజంపేట (ఎంపీ)

ఎంసిసి నిబంధనలు తప్పక పాటించాలి

- విలేకరుల సమావేశంలో కలెక్టర్, ఎస్‌పి

మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, చిత్రంలో ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి-రాయచోటి

త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలు అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికల నిర్వహణపై ఎస్‌పి కృష్ణారావుతో కలిసి కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు. ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ఛాలెంజ్‌గా తీసుకొని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు పర్చాలన్నారు. ఈ ఎన్నికలలో ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఎంసిసి నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలు చేయడం, రెచ్చగొట్టేలా రాజకీయనేతలు ప్రవర్తించకూడదన్నారు. మసీదులు, చర్చీలు, దేవాలయాలు, ఇతర ప్రార్థన స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదన్నారు. పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను తీసుకురావడం, తిరిగి తీసుకువెళ్లడం వంటివి నిషిద్ధమన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం,లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం, డబ్బులు పంపిణీ చేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించకూడదన్నారు. నిబంధనల ప్రకారం వెహికల్ పరిమిషన్ తీసుకోవాలన్నారు. ఎంసిసి వైలేషన్స్ జరిగినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సమర్ధవంతంగా నిర్వహించేందుకు కలెక్టరేట్లో ఒక కంట్రోల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో అధికారులు భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమ నిబంధనల మేరకే పని చేయాల్సి ఉంటుందన్నారు.ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు జారీ చేసే నిబంధనలను చక్కగా అవగాహన చేసుకుని నిర్దేశిత సమయంలోనే పనులు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారా, ఓటర్లను ప్రభావితం చేసే పనులు ఎవరైనా చేపడుతున్నారా, తదితరాలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫోటోలను తొలగించాలని, రాజకీయ నేతల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో 14,12,266 మంది ఓటర్లు ఉన్నారని ఈసారి 80 శాతం ఓటింగ్ జరిగేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల విధులలో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామన్నారు. జిల్లాల 266 రూట్లు ఏర్పాటు చేసి 18 ఫ్లేయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామన్నారు. సి విజిల్ ప్రతి ఒక్కరు డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. సి విజయ్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకొని పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్కరు విజిల్ ద్వారా ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ బూతులకు రాలేని 80 సంవత్సరాలు పైబడిన వారు, దివ్యాంగులకు ఇంటి దగ్గర నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. గతంలో ఎప్పుడూ ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అని చర్యలు చేపట్టడం జరిగిందని ప్రతి ఒక్కరు ఈ ఎన్నికలకు సహకరించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించారు. శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి గ్రూప్- 1 పరీక్షలకు సంబంధించిన సూచనలు, ఎన్నికల మోడల్ కోడ్ ప్రవర్తన, ఎంఎస్ఎంఇ, పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి, ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీటి ఎద్దడి నివారణ, వైద్య ఆరోగ్యం, జనన మరణాల నమోదు తదితర అంశాలపై కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డిఆర్ఓ సత్యనారాయణరావు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుపరచాలన్నారు. ప్రభుత్వ పథకాలలో ఇప్పటికే ఆమోదం పొంది ప్రారంభించి ఇంకా పూర్తికాని పనులను పూర్తి చేయాలన్నారు. కొత్త పనులను చేపట్ట రాదన్నారు. రానున్న వేసవికాలంలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి రాకుండా తగిన కార్యాచరణ ప్రణాళికల రూపొందించుకొని ముందుకు వెళ్లాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో నీటి సరఫరాను పరిశీలించి నీటి ఎద్దడికి గురి అయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి అవసరమైన ప్రాంతాలలో నీటి సరఫరాను పునరుద్ధరించడం, రవాణాకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉపాధి పనులను విరివిగా చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులకు సూచించారు. ముఖ్యంగా కరువు మండలాలలో ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే ఆమోదం పొందిన సెల్ఫ్ ఆఫ్ గ్రూప్ పనులను ముమ్మరం చేయాలన్నారు. హౌసింగ్‌లో 90 రోజుల పనులు పూర్తయిన వాటికి బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల మోడల్ కోడ్ దృష్టిలో ఉంచుకొని ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా జిల్లాలో ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించాలని, వైద్య శిబిరాలలో గుర్తించిన రెఫెరల్ రోగులను ఆసుపత్రులకు వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. నీటి కలుషితం వల్ల డయేరియా ప్రబలకుండా తగు నివారణ చర్యలు తీసుకోవాలని, పట్టణ గ్రామీణ ప్రాంతాలలో జనన, మరణాలను పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బిజెపితో జత కట్టడం అనైతికం : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె

మతతత్వ పార్టీ బిజెపితో టిడిపి, జనసేన జతకట్టడం అనైతికమని మదనపల్లె వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు అంటే కేవలం మదనపల్లిలో ఎస్ఎల్ కుటుంబ మొక్కటేనా అని గతంలో బిజెపి మతతత్వ పార్టీ అని ఎమ్మెల్యేగా షాజహాన్‌బాష విమర్శించారని గుర్తుచేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన నేడు టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా టికెట్లు పొంది మైనార్టీల పట్ల ప్రేమ వలకపోస్తున్నారని విమర్శించారు. మీ కుటుంబానికి రాజకీయపరంగా పెద్దిరెడ్డి కుటుంబం, ఎంతో మేలు చేసిందని తెలిపారు. నేడు తమ్ముడు నవాజ్‌బాషాకు సీటు రాకపోవడంతో పెద్దిరెడ్డి కుటుంబంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం నవాజ్‌బాషాకు తగదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటా చలపతి, నాయకులు ముబషీర్ అహమ్మద్, లియకత్ ఆలీఖాన్, ఇర్ఫాన్‌ఖాన్, రఫీ మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికలలో వైసిపి అభ్యర్థిగా ఉన్న నిస్సార్ అహ్మద్ అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ కిరణ్‌రెడ్డి, కురబ సంగం నాయకులు జబ్బల శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ తట్టి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్ అహ్మద్

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : పట్టణ ఆరోగ్య కేంద్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డిపిఎంఒ) డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. శనివారం జిల్లా న్యూక్లిస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డితో కలసి రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కె.కొత్తపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా అయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఒపి సంఖ్య పెంచాలని, ఆశా కార్యకర్తలు ద్వారా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించే సేవలు గురించి ప్రతీ ఇంటికి సమాచారం అందించాలని కోరారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో 172 రకాల మందులు 60 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, వీటిల్లో బిపి, షుగర్, మలేరియా, డెంగీ ,హెచ్‌బి, హిమతాలజీ, సీరాలజీ, క్లినికల్ పాతాలజీ, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు ఉన్నాయని తెలిపారు. అనంతరం రికార్డులు, ల్యాబ్, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అల్తాఫ్, పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

'మిట్స్'లో ఇన్నోటెక్ స్పార్క్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-మదనపల్లి : మిట్స్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం వారు ఇన్నోటెక్ స్పార్క్ ప్రోగ్రాంను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ కలశాల విద్యార్థులలోని నూతన ఆలోచనలను ఈ కార్యకమంలో ఇతరులతో పంచుకోవడానికి ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. నేటి ఆధునిక మనిషి జీవన శైలిలో టెక్నాలజీ ఓ భాగంగా మారిపోయిందన్నారు. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్లెట్ ఇలా ఇటీవల అందుబాటులోకి వచ్చిన అనేకమైన స్మార్ట్ సాంకేతిక ఉత్పత్తులు ఆధునిక జనరేషన్‌కు అద్దం పడుతున్నాయన్నారు. ఈ నూతన ఆలోచనలను విద్యార్థి స్థాయీ నుంచి పరిశ్ర మలు స్థాపించే స్థాయికి ఎదగడానికి ఒకమంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ భాస్కరన్, ఐఐసి కో-ఆర్డినేటర్ అరుళ్ కుమార్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అజిత్ జి.జోషి పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 36 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శనివారం సైంటిఫిక్ ఎర్నివా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో సుమారు 36 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డి.స్వర్ణలత తెలియజేశారు. కంపెనీ ఉపాధ్యక్షులు నవీన్, సీనియర్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రశాంతి, టీం లీడ్ కావ్య, నితీష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పరీక్ష, బృంద చర్చ, టెక్నికల్ రౌండ్ నిర్వహించి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. సుమారు 90 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 36 మంది ఎంపికయ్యారని, వీరిలో బిఫార్మసీ అర్హతతో ఉద్యోగాన్ని పొందిన విద్యార్థులకు సుమారు రూ.2.3 లక్షలు వార్షిక వేతనం, ఎంఫార్మసీ అర్హతతో ఉద్యోగం పొందిన వారికి రూ.3 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని ప్రిన్సిపల్ స్వర్ణలత తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, కార్యదర్శి గంగిరెడ్డి, చైర్మన్ రామచంద్రారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ద్వారకనాథ్‌రెడ్డి, నరసింహులు, డాక్టర్ ఎం.శిరీష, డాక్టర్ ఎం.హంస బేగ్, మహేంద్ర, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం : జడ్జి

ప్రజాశక్తి-పీలేరు

కేసుల పరిష్కారంలో కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గమని 8వ అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి తెలిపారు. శనివారం పీలేరులో కోర్టు ఆవరణంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్లో ఏర్పాటుచేసిన రెండు బెంచ్‌ల ద్వారా 38 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో న్యాయమూర్తులు మాట్లాడుతూ ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులను కక్షిదారులు ఇరువర్గాలూ రాజీ పడి తమ కేసులను సులభంగా పరిష్కరించుకోవడానికి ఈ లోక్ అదాలత్లు సరైన వేదికలని అన్నారు. దీనివల్ల వారికి సమయం, డబ్బు వృధా కాకుండా కేసులు పరిష్కరించుకోవడానికి ఇది మంచి అవకాశమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెంచ్ సభ్యులుగా న్యాయవాదులు తెనాలి రామ సుబ్రహ్మణ్యం, పివి రమణా రెడ్డి వ్యవహరించారు. అలాగే న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుల్స్, ట్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అడ్వకేట్స్ పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని ఆశ్రయించిన బాధితులు

పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న బాధితులు

ప్రజాశక్తి-మదనపల్లి : పట్టణంలో చీటీలు వేసి నష్టపోయిన తమకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన బాధితులు మంత్రి పెద్దిరెడ్డిని ఎర్రతివారిపల్లిలోని మంత్రి నివాసం శనివారం బాధితులు కలిసి స్థానిక విఎస్ఆర్ గ్రాండ్ నిర్వాహకులు ఎయిర్టెల్ సుధాకర్‌రెడ్డి వద్ద చీటీలు వేసి తాము తీవ్రంగా నష్టపోయామని విన్నవించారు. ఎన్నో సంవత్సరాలుగా అతని వద్ద నమ్మకంగా చీటీలు వేస్తూ ఉన్నామని అయితే కొన్ని నెలలుగా తమకు చెల్లించాల్సిన చీటీ డబ్బులను ఇవ్వాలని కోరగా ఇవ్వకుండా తనకు సంబంధం లేదని మోసం చేశాడని పేర్కొన్నారు. అతని వద్ద పనిచేస్తున్న కృష్ణారెడ్డి మీద వేస్తున్నారని చెప్పారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాషాలపై కేసు నమోదు చేశారని తెలిపారు. తమను ఆదుకోవాలని లేనిపక్షంలో తామందరం ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తమ గోడును విన్న వెంటనే డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని తెలిపారని పేర్కొన్నారు.

సైనిక్ ప్రవేశ ఫలితాల్లో 'నందిని' హవా

ప్రజాశక్తి - రాయచోటి : 2024 సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలల్లో అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఎన్‌జిఒ కాలనిలో ఉన్న నందిని నవోదయ అండ్ సైనిక్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు విజయ దుందుభి మోగించారని గౌరవ సలహాదారు రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం విడుదలైన పరీక్ష ఫలితాలలో అన్నమయ్య కడప జిల్లా ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించిన తమ నందిని సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటరుకు చెందిన వేమ సిద్ధార్థ, మనీష్ 300 మార్కులకు గాను 278, 275 మార్కులతో తెలుగు రాష్ట్రాల్లో విజయ కేతనం ఎగురవేసి ప్రభంజనం సృష్టించారని తెలిపారు.

మాట్లాడుతున్న రావుల నరసింహారెడ్డి

బూత్ కమిటీలదే క్రియాశీలక పాత్ర

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి బూత్ కమిటీ సభ్యులు కీలక పాత్ర పోషించాలని జిల్లా జెసిఎస్ కో-ఆర్డినేటర్ రావుల నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు బి.కొత్తకోట టౌన్, రూరల్ మండలంలో బూత్ కమిటీల నిర్మాణం, శిక్షణ కార్యక్రమాన్ని శనివారం బెంగళూరు రోడ్డులో గల ఎకె ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించుకుని మరల ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుందామని, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు సమిష్టి కృషితోనే అది సాధ్యమని తెలిపారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ మీ క్లస్టర్ పరిధిలోని వార్డుల్లో ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమాలపై ప్రజలకు పదేపదే అవగాహన కల్పించాలని సూచించారు. 2019లో వచ్చిన మెజార్టీ కన్నా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ వచ్చే దిశగా కృషి చేయాలని అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిని గెలిపించుకొని వైసిపి విజయంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఎన్.ప్రదీప్‌రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ యన్.రెడ్డి, హరి, రూరల్ వైసిపి పట్టణ అధ్యక్షులు సి.ఆర్.చిన్నికృష్ణ సచివాలయ కన్వీనర్లు శెట్టిపల్లి రమేష్‌రెడ్డి, కంచి కల్యాణ్ కుమార్‌రెడ్డి, జివి రామకృష్ణ, నక్క సంతోష్, గుమ్మడికాయ చాంద్ బాషా, జెఎన్‌పి శ్రీనివాసులు, వైస్ ఎంపిపి వలి పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని ముష్టూరు కెజిబివి పాఠశాలలో 2024-25 సంవత్సరానికి ఆరవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఒ ముని వెంకటమ్మ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 11న ముగుస్తుందన్నారు. పాఠశాలలో ప్రవేశం పొందే విద్యార్థుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, విద్యార్థిని ప్రస్తుతం చదువుతున్న పాఠశాల వివరాలు, ఫోన్ నెంబర్లతో సహా రెండు జతల జిరాక్స్ కాపీలు పాఠశాలలో సమర్పిస్తే ఆన్‌లైన్ చేస్తామన్నారు. డ్రాప్ అవుట్స్, అనాథలు, బడి బయట చిన్నారులు, దారిద్రరేఖకు దిగువన ఉన్నవారు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ బాలికలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. సంవత్సరాదాయం గ్రామీణ ప్రాంతాల్లో వారికి రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంతాల్లో వారికి రూ.1.40లక్షలు మించి ఆదాయం ఉండకూడదన్నారు. ఆన్‌లైన్ పూర్తయిన తర్వాత అర్హుల జాబితా రాష్ట్ర కార్యాలయం నుంచి నేరుగా అభ్యర్థుల చరవాణికే సమాచారం అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బడుగుల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-కలకడ

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుతోనే సాధ్యమని కల కడ పట్టణ ఇన్‌ఛార్జి బాషా పేర్కొన్నారు. మండలంలోని కలకడ, కొత్తపల్లిలో బాబు ష్యూరిటి-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు, కర్తలతో కలిసి ఇంటింటి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. రైతు సమస్యలు తీరాలన్న, నిరుద్యోగులు బాగుపడాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, అరాచక పాలనకు అడ్డుకట్ట వేయాలంటే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, మునాఫ్, జాఫర్ హుస్సేన్,ఖాజా హుస్సేన్ ,కరీముల్లా బాషా, ఇమ్రాన్ ,నౌషద్ అలీ, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో తేడాలు

- పారదర్శకత లేని 'ఉపాధి' మస్టర్లు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలో ఉపాధి హామీ పథకంలో పారదర్శకత కొరవడింది. ఉపాధి పనుల్లో బినామీలను నివారించడానికి నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టం ప్రవేశపెట్టినప్పటికీ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణ వస్తున్నాయి. ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతంలో పని ప్రాంతం, ఉపాధి కూలీలను ఫోటో తీసి అప్లోడ్ చేయాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయి సిబ్బంది ఫోటోలు తూతూ మంత్రంగా అప్లోడ్ చేస్తు కూలీలను స్పష్టంగా ఫోటోలు తీయ కుండా ఫోటోలు అప్లోడ్ చేస్తూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని విమర్శలు వస్తున్నాయి. మాస్టర్ రోల్ లోని కూలీలను మొత్తం ఒక గ్రూపుగా నిలబెట్టి స్పష్టంగా ఫోటోలు అప్లోడ్ చేయాల్సి ఉండగా నిబంధనం పాటించకుండా నిర్లక్ష్యంగా ఫోటోలు అప్లోడ్ చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిరసన వ్యక్తం చేస్తున్న దొమ్మలపాటి రమేష్ అనుచరులు

'దొమ్మలపాటి' కే టికెట్ కేటాయించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు వారి వారి అభ్యర్థులను ప్రకటించి ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. మదనపల్లి నియోజకవర్గానికి ప్రస్తుతం టిడిపి ఇన్‌ఛార్జిగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే దోమ్మలపాటి రమేష్‌ను ప్రక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు టికె ట్ కేటాయించడంపై శనివారం దొమ్మలపాటి రమేష్ వర్గం నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. నిమ్మనపల్లి బస్టాండ్ లో శనివారం టిడిపి మండల అధ్యక్షులు పుర వెంకట రమణ, తెలుగు యువత మండలాధ్యక్షులు చిన్నబాబు, రాజంపేట బిసిసెల్ అధికార ప్రతినిధి రమణ ఆధ్వర్యంలో దోమ్మలపాటకి టిక్కెట్ దగ్గకపోవడంపై నిరసనలు వ్యక్తం చేశారు. మదనపల్లి నియోజకవర్గంలో టిడిపి విజయం సాధించాలంటే దోమ్మలపాటి రమేష్ కే టికెట్ కేటాయించాలని నినాదాలు చేశారు. గత ఇరవై ఏళ్లుగా నియోజకవర్గంలో పార్టీకి అండగా ఉంటూ పార్టీని బలోపేతం చేశారని, పార్టీ కష్ట కాలంలో ఉంటే పార్టీ కోసం నిరంతరం శ్రమించారని అన్నారు. అటువంటి వ్యక్తిని కాదని కొత్తగా పార్టీలోకి వచ్చిన వ్యక్తికి టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, విజయ్, మురళీమోహన్, శంకర, గోపి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను అందరూ పాటించాలి

ప్రజాశక్తి-నందలూరు

ఎన్నికల కోడ్‌ను అందరూ తప్పక పాటించాలని తహాశీల్దార్ మహబూబ్‌బాషా, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సతీష్ కుమార్, ఎస్ఐ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. శనివారం ఎంపిడిఒ సభా భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో మోడల్ కోడ్ ఆఫ్ కాంట్రాక్ట్ (ఎం సిసి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్రంలో త్వరలో రానున్న ఎన్నికల కోడ్ సమయంలో ఏ గ్రామంలో వ్యక్తులను ప్రేరేపించే విధంగా ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లను తొలగించాలని నేతల విగ్రహాలకు ముసుగులు తొడగాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామాలలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాల సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

యువత ఓటుతోనే దేశ భవిష్యత్తు : జెసి

ప్రజాశక్తి-కలికిరి

జెసి ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది

యువత ఓటుతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. కలికిరి జెఎన్‌టియులో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడ మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర, జెఎన్‌టియు ఆధ్వర్యంలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం జెఎన్‌టియు కాలేజీ ఆడిటోరియంలో శనివారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. అనంతరం అయన మాట్లడుతూ యువత ఓటు హక్కును ఒక్క పండగగా జరుపుకొవాలని, ఎవరికి ప్రలోభ పడకుండా ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును విని యోగించు కోవాలని, యువత ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలను అలవాటు చేసు కోవడానికి నైబర్ హుడ్ యూత్ పార్ల మెంటు వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని స్వీప్ స్పెషల్ ఆఫీసర్ రాజశేఖరరెడ్డి అన్నారు. జిల్లాలోని యువత ప్రతిభను గుర్తించి వారిలోని నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికే యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. యువత ఓటును ఒక్క హక్కుగా కాకుండా ఒక్క భాద్యతగా తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. యువతకు ఓటు ఒక ఆయుధమని కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అపర్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో కలికిరి తహాశీల్దార్, జెఎన్‌టియు సిబ్బంది, రెవెన్యూ అధికారులు, నెహ్రూ యువ కేంద్రంవాలంటీర్లు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు

రైల్వేకోడూరు : పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భారతావనికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియలో తెలుగు వారి కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు ప్రాణాలర్పించిన అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు అని కృష్ణారెడ్డి కితాబునిచ్చారు. శనివారం శ్రీపొట్టి శ్రీరాములు 123వ జయంతిని పురస్కరించుకొని స్థానిక వాకర్స్ యూనియన్ ఆవరణంలో వివిధ శాఖల వాకర్స్ సభ్యులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం 57 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలర్పించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సాంబశివ, నాగభూషణ, ఓలేటి ప్రసాద్, కృష్ణమూర్తి, రాజశేఖర్, డాక్టర్ హరినాద్ రెడ్డి, బద్రి, ప్రభాకర పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతిని శివాలయం సర్కిల్‌లో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేస ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు గ్రామ ఆర్యవైశ్యులు, ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం నాయకులు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి చలపాటి హరినాథ్, మహాసభ ఆత్మీయ కమిటీ అధ్యక్షులు రామచంద్రయ్య, కోడూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గునిశెట్టి రమేష్, మాజీ అధ్యక్షులు మేడా వెంకటసుబ్బయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ సుకుమార్‌రెడ్డి, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోటశివసాయి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కలపాటి శ్రీధర్, ఎంపిటిసి రావూఫ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గాలివీడు

ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు జరుగునున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండల కేంద్రంలో మూడు సెంటర్లను ఏర్పాటు చేశామని, 38 మంది ఇన్విజిలేటర్‌లను నియమించినట్లు ఎంఇఒ-1 నాగ రాజు పేర్కొన్నారు. బాలి కల ఉన్నత పాఠశాలకు చీఫ్‌గా దుర్గేశ్వర్‌రాజు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా చక్రపాణి, బాలుర ఉన్నత పాఠశాలకు చీఫ్ గా సుబ్బరాయుడు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా బలరాంనాయక్, ఉర్దూ ఉన్నత పాఠశాలకు చీఫ్‌గా రాధాకృష్ణ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా అబిదాను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని గదుల్లో బెంచీలు ఏర్పాటు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లను పూర్తిచేశామన్నారు. **కెవిపల్లి:** మండలంలో పదిపరీక్షలకు మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఇఒలు రెడ్డిబాషా, డి.సుబ్రమణ్యంరెడ్డిలు తెలిపారు. మోడల్ స్కూల్ లో190 మంది, జడ్‌పిహైస్కూల్‌లో 160 మంది, ఎపిఆర్ఎస్ గ్యారంపల్లిలో 180 మంది, మొత్తం 530 విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం, విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్, లైట్లు, ఫ్యాన్లు, వైద్య సౌకర్యం అన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రా ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులు హాల్ టికెట్ చూపి బస్సుల్లో ఉచితంగా త్వరగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇన్విజిలేటర్‌లతో సహా ఎవరూ సెల్ ఫోన్లు తీసుకు రాకూడదని చెప్పారు. **పీలేరు :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు పీలేరు మండల విద్యాశాఖ అధికారులు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ మార్చి 18 నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు మార్చి 30 వరకు జరగనున్నాయన్నారు. ఇందుకోసం పీలేరు మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల నుంచి 1,560 మంది రెగ్యులర్, 190 మంది ప్రయివేట్ మొత్తం1,750 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. వీరి కోసం పట్టణంలోని అయ్యప్ప రెడ్డి కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ అమృత పాఠశాల, జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాల, కోటపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కోటపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, విఎస్ఎన్ సిద్ధార్థ స్కూల్, శ్రీ కాకతీయ స్కూల్ తో పాటు మండల పరిధిలోని రేగళ్ళు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తలుపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం తొమ్మిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎంపిపి

ప్రజాశక్తి-గాలివీడు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసులు

మండలంలో రానున్న వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపిపి జల్లా పద్మావతి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపిపి జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ ఎంపిపి మిట్టపల్లి యధుభుషణ్‌రెడ్డి మాట్లాడుతూ మండలానికి ఇన్‌పుట్ సబ్సీడి కింద ఐదు కోట్లు మంజూరు కావడంతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయ అధికారి మురళీధర్ మాట్లాడుతూ మండలంలో పంట రైతు నష్టపోయిన రైతులు అందరికీ న్యాయం జరిగిందని రెండు మూడు రోజుల్లో ఇన్‌పుట్ సబ్సిడీ వారి ఖాతాలో జమవుతుందని పేర్కొన్నారు. వైద్యాధికారి మాట్లాడుతూ నెలకు రెండు సార్లు 104 ద్వారా గృహాలు సందర్శించి రోగులకు వైద్యసేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ల్యాబ్‌లో 14 పరీక్షలు నిర్వహిస్తున్న వారిమైతే ఇప్పుడు అత్యధిక పరికరావడంతో 54పరీక్షలు వైద్య పరీక్షలు నిర్వహి స్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వడదెబ్బ ప్రభావం లేకుండా ఎండల్లో సాయంత్రం పూట పనులు ఉదయం చేసు కోవాలని ఒఆర్ఎస్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఎంఇఒ వల్లపు శ్రీనివాస్ మాట్లా డుతూ రెండో విడత నాడు-నేడు క్రింద ఎలా ఏడు లక్షలు నిధులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వైస్ ఎంపిపి-2 గాలి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆవుల శెట్టివారిపల్లి ప్రాథమిక పాఠశాల పెచ్చులూరి ఉందని, మూడో విడత నాడు-నేడు కింద నిధులు మంజూరు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో వంటగది, మరుగుదొడ్లు ఏర్పాటు కూడా నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిటి తిమ్మారెడ్డి, ఎంపిటిసిలు చంద్రారెడ్డి , నవాజ్ షరీఫ్, కడప అమానుల పంచ్‌లు, ఉమాపతిరెడ్డి, మల్లికార్జున్ నాయుడు, కేశవరెడ్డి, ఎపిఒ, ఎపిఎం, హార్టికల్చర్, సూపరింటెండెంట్ జాబిర్ అహమ్మద్, కార్యదర్శులు సచివాల సెక్రటరీలు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులకు శాశ్వత పరిష్కారం : జడ్జి

నందలూరు : కేసులను పరిష్కరిస్తున్న జడ్జి కె.లత

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలతో మొత్తం 75 కేసులు పరిష్కారం అయ్యాయని జూనియర్ సివిల్ జడ్జి అంజని ప్రియదర్శిని తెలిపారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ కాదగినటువంటి క్రిమినల్, సివిల్, బ్యాంకు కేసులను దాదాపు 75 కేసులు పరిష్కరించి రూ.18,30,614లు నగదు అర్జీదారులకు ఇప్పించడం జరిగిందన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.వెంకట రామరాజు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు:** జాతీయ లోక్ అదాలత్ నందు 73 కేసులకు శాశ్వత పరిష్కారం లభించినట్లు నందలూరు జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.లత పేర్కొన్నారు. జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు లో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సివిల్ కేసుల్లో రూ.6లక్షలు, క్రిమినల్ కేసుల్లో రూ.35,69,600లు ఫిర్యా దారులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంల నందలూరు,రాజంపేట ఎపిపిలు ఉమారాణి, రెహానా రసూల్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు, న్యాయ వాదులు మహమ్మద్ అలీ, ఆనంద్ కుమార్, ఎజిపి షమీ ఉల్లా ఖాన్, కోర్టు కానిస్టేబుల్, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** స్థానిక జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో శనివారం మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు స్థానిక ఇన్‌ఛార్జి జడ్జి అధ్యక్షతన లోకదాలత్ నిర్వహించారు. ఒక ఒఎస్ సంబంధించిన కేసు మరో మూడు క్రిమినల్‌కు సంబంధించిన కేసులను ఇరు వర్గాల కక్షీదారుల సమ్మతి మేరకు పరిష్కరించారు. కేసులకు సంబంధించి రూ.1,70లక్షలు రికవరీ చేశారు. లోక్ అదాలత్‌లో కేసులకు శాశ్వత పరిష్కారం వస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షులు నాగమల్‌రెడ్డి, న్యాయ వాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

వైసిపిని మరోమారు ఆదరించండి :'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

ప్రచారాన్ని ప్రారంభిస్తున్న చింతల రామచంద్రారెడ్డి

వైసిపి ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిటిసి బోగేష్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన బొలెరో ఎన్నికల ప్రచార వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల అమలు చేసిన ఘనత సిఎందేనని కొనియాడారు. రాబోయే వైసిపిని గెలిపించాలని కోరారు. నవర త్నాల పథకంలో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు.కులం, మతం, భేదం చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. సంక్షేమ పాలన కోసం జగన్‌ను మరల ముఖ్యమంత్రిని చేసుకుందామని పేర్కొన్నారు. రామచంద్రారెడ్డిని మరల ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం పట్ల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి బోగేష్, నాయకులు మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ నల్లరి తిమ్మారెడ్డి, గుట్టపాలెం సర్పంచ్ రెడ్డివారి వెంకట్‌రెడ్డి, శివయోగ శివాజీ, జిల్లా ఎస్‌సి సెల్ కార్యదర్శి హరి, మైనార్టీ యువనాయకులు వేంపల్లి బావాజీ, హనీఫ్, వార్డు మెంబర్ ఖాదర వల్లి, మద్దిరాల మల్లికార్జున, నాగేంద్ర, మధురెడ్డి, వార్డ్ మెంబర్ ఖాదరవల్లి, వైస్ ఎంపిపి శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

నీటి శుద్ధి యంత్రం నుంచి నీటిని తాగుతున్న ఎంఇఒ, విద్యార్థులు

వినియోగంలోకి నీటిశుద్ధి యంత్రం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో 'నిరుపయోగంగా నీటి శుద్ధి యంత్రం' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు జిల్లా, మండల అధికార యంత్రాంగం స్పందించారు. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి యంత్రానికి శనివారం మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు, మండల అధికారులు, ఉపాధ్యాయుల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మధ్యాహ్నం భోజనం సమయానికి మరమ్మతులు పూర్తి చేయడంతో విద్యార్థులు శుద్ధి జలాన్ని తాగారు. కార్యక్రమంలో ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు, ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, మండల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లూరులో టిడిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని మల్లూరులో గ్రామస్తులు టిడిపినాయకులు, కార్యకర్తలతో కలిసి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లిము మైనార్టీనాయకులు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇస్తే మండలాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చు కుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని కదిరాయచెరువు పంచాయతీలో శనివారం రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను ఎంపిపి శ్రీదేవి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజల వద్దకే పాలని తీసుకువచ్చి రైతులకి రైతు భరోసా కేంద్రం నుంచి నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, యంత్ర సేవలు అందిస్తున్నారని అన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతుందని ఈ సదుపాయాలని కదిరయచేరువు పంచాయతీ ప్రజలందరూ సదునియపరచుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసే వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి, జవహర్‌బాబు, వైద్య సిబ్బంది, ప్రత్యేక ఆహ్వానితులు జివి.కిషోర్, పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి, సుధాకర్, పుల్లయ్య, చలమయ్య, శ్రీనివాసులు, చిరంజీవి, శ్రీకాంత్ సెక్రటరీ జయ చంద్ర పాల్గొన్నారు.

అన్నదాన సేవ కమిటీ అధ్యక్షులుగా రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండ అన్నదాన సేవా కమిటీ నూతన అధ్యక్షులుగా గిరిగి రాజశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పాత కళాశాల వద్ద అన్న దాన ట్రస్ట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గతంలో అధ్యక్షులుగా ఉన్న రమణారెడ్డి అధ్యక్షతన మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్య కొండకు వచ్చే భక్తులకు అన్న సందర్భంగా ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ఆదాయం ఖర్చుతో తదితరాలపై కమిటీ సభ్యుల సమక్షంలో చర్చించారు. భక్తుల విరాళాలు వస్తు సామాగ్రి ద్వారా రూ.13,81960లు వచ్చినట్లు తెలిపారు. అన్న సంతర్పణ నిర్వహణకు రూ.13,70544లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అందులో 11,416రూపాయలు మిగిలినట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని కమిటీ అకౌంట్లో జమ చేయను అన్నట్లు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షులుగా గిరిగి రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా నారాయణ రెడ్డి, వై.భాస్కర్ రెడ్డి, కార్యదర్శిగా శివకుమార్, కోశ్య అధికారిఅశోక్ కుమార్ రెడ్డి లను కమిటి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళలకు వరం జగనన్న చేయూత

ప్రజాశక్తి - నందలూరు

జగనన్న చేయూత మహిళలకు వరమని జడ్‌పిటిసి గడికోట ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్రలు పేర్కొన్నారు.శనివారం ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో ఎంపిఎం వసుంధర ఆధ్వర్యంలో జగనన్న చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం 45 ఏళ్ల నుండి 60 ఏళ్ల వయసు కలిగిన మహిళలకు నాలుగు విడతల్లో చేయూత పథకం అందించారన్నారు. నాలుగో విడతలో మండలంలోని1619 మంది మహిళలకు మూడు కోట్ల నాలుగు లక్షల రూపాయల చేయూత నగదును నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలుతుమ్మల భావన, అనుదీప్, జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, జెసిఎస్ కన్వీనర్ కలీం, ఉప సర్పంచ్ ఇబ్బు, అరిగెల సౌమిత్రి, ఆనాల మధు యాదవ్, గుణ యాదవ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు సిబ్బంది

నాటు సారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మదనపల్లి డిఎస్‌పి ప్రసాద్ రెడ్డి, ములకలచెరువు సిఐ తమ్మిశెట్టి మధు ఆదేశాల మేరకు మండలంలోని రామనాయక్ తండాకు దక్షిణముగా చెరువు వద్ద నాటుసారా తయారు చేస్తున్నారని సమాచారం దాడిచేసి ధ్వంసం చేసినట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. శనివారం ఎఎస్ఐ మధుసూదన ఆచారి, పోలీస్ సిబ్బంది, కేంద్ర సాయుధ దళాలతో శనివారం బండకింద తండా నాకాబంది నిర్వహించినట్లు తెలిపారు. అక్కడ నాటు సారా తయారు చేస్తున్న వూటను కనుగొని 350 లీటర్ల నాటు సారా భట్టిని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది కృష్ణమూర్తి, మధుకర్, హోంగార్డు నాగరాజ్ లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న కారు : రైతు మృతి

ప్రజాశక్తి- బి.కొత్తకోట

ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుండి కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సిఐసూర్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గుడిపల్లికి చెందిన వెంకట్రాయప్ప కుమారుడు రమేష్‌రెడ్డి (44)కి గుడిపల్లి క్రాస్ తానామిట్ట రోడ్డు వద్ద వ్యవసాయ పొలం ఉందని అన్నారు.ప్రతిరోజు తన పొలం వద్దకు వెళ్లి సాయంత్రం గుడిపల్లికి వచ్చేవాడని చెప్పారు. గురువారం రాత్రి వ్యవసాయ పనులు ముగించుకుని వస్తుండగా గుడిపల్లి క్రాస్ వద్ద కర్ణాటక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు తన ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుండి ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో రమేష్ రెడ్డి మృతిచెందాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ బొజ్జ నాయక్ తెలిపారు.కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే నిందితుడిని అరెస్టు చేస్తామని తెలిపారు.